జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 23-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 290 పేజీలు: 4 వెల : రూ.7







*** పదో తరగతి పరీక్షల్లో చూచిరాత * దగ్గరుండి సహకరించిన గురువులు * 11 మంది ఉపాధ్యాయులు, మరో బోధనేతర సిబ్బందిపై వేటు * ముగ్గురు ప్రధానోపాధ్యాయులపై చర్యలకు సిఫారసు * కుప్పిలిలో ఐదుగురు విద్యార్థుల డిబార్ * పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఈవో * రాష్ట్రవ్యాప్తంగా సంచలనం * కొందరి వల్ల శ్రీకాకుళం జిల్లాకు అప్రదిష్ట**

## కుప్పిలి ఆదర్శ పాఠశాలలో..
# మాస్ కాపీయింగ్

**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధనే లక్ష్యంగా పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు చూచిరాతకు సహకరించి పట్టుబడ్డారు.. కొందరు గురువులు. ఆదర్శంగా ఉండాల్సిన వారే దారితప్పారు. ఈ విషయం ప్రత్యేక స్క్వాడ్ బయట పెట్టడంతో ఏకంగా 11 మంది ఉపాధ్యాయులు, మరో బోధనేతర సిబ్బందిపై విద్యాశాఖ వేటు వేసింది. మరో ముగ్గురు ప్రధానోపాధ్యాయులపై చర్య లకు సిఫార్సు చేసింది. వీరిపై ఎచ్చెర్ల పోలీసులకు ఏకంగా డీఈవో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. విద్యావ్యవస్థలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 'ఎ'లో 207 మంది, 'బి'లో 218 మంది విద్యార్థులను కేటాయించారు. ఇక్కడి పరీక్షల నిర్వహణ తీరుపై కొందరు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు నాలుగు స్క్వాడ్ బృందాలు శుక్రవారం ఆయా కేంద్రాలపై ఏకకాలంలో దాడులు చేశాయి. విద్యార్థులు ఆంగ్ల పరీక్షను చూసి రాస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సహకరించిన సిట్టింగ్ స్క్వాడ్ ఎంవీ కామేశ్వరరావు, డిపార్టుమెంట్ అధికారులు బీవీ సాయిరాం, పి.హరికృష్ణ, ఇన్విజిలేటర్లు ఎం.కనకరాజు, ఎస్.కృష్ణ, పి.నాగేశ్వరరావు, కె.కామేశ్వరరావు, ఎ.శ్రీరాములునాయుడు, ఎస్.శ్రీనివాసరావు, బి.రామ్మోహన్‌రావు, పి.ఫల్గుణరావులను, బోధనేతర సిబ్బంది ఒకరిని డీఈవో సస్పెండ్ చేశారు. ఏ కేంద్రంలో ముగ్గురు, బీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. కుప్పిలిలోని జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులే స్లిప్పులు తయారు చేసి ఆదర్శ పాఠశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు అందజేస్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ స్క్వాడ్ ఉన్నప్పటికీ పక్కా ప్రణాళికతో విచ్చలవిడిగా చూచిరాతకు సహకరిస్తుండటాన్ని గమనించిన తనిఖీ బృందాలు నిర్ఘాంతపోయాయి. కుప్పిలి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.పద్మకుమారి, చీఫ్ సూపరింటెండెంట్లు పీవీ దుర్గారావు (హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, కేశవరాయునిపాలెం) ఎం.లక్ష్మణరావు (హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, కొత్తపేట)లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ డీఈవో ఆర్‌జేడీకి నివేదిక పంపారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టారు.

### పునరావృత్తం కాకుండా చూస్తాం: డీఈవో

డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై పోలీసు లకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుళ్లామన్నారు.

### ఆరుగురిపై కేసు..

కుప్పిలి మోడల్ స్కూల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుండగా.. డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయులు ఎం.కనకరాజు(ఎస్ఏ ఇంగ్లిష్, బుడగట్లపాలెం), ఎస్.కృష్ణ(ఎస్ఏ హిందీ, కొయ్యాం), పి.నాగేశ్వరరావు (ఎస్ఏ మేథ్స్, కుప్పిలి), కె.కామేశ్వరరావు (ఎస్ఏ, హిందీ, కుప్పిలి), జె.పద్మకుమారి (హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, కుప్పిలి), బి.కృష్ణ కిశోర్ (బోధనేతర సిబ్బంది, కుప్పిలి)పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. వీరిపై ఛీటింగ్, మాల్‌ప్రాక్టీస్ 318/4, 61/2, 3/5, 97,98 తదితర సెక్షన్లను నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తులో మరికొన్ని పేర్లు చేరే అవకాశం ఉందన్నారు.

## నిద్రలో.. హైవే..
# పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 22 (వార్త):** శ్రీకాకుళం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చూడాలని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలు ఇస్తున్నా కొందరు పోలీసులు మాత్రం.. మనకు కాదులే.. అన్నట్టుగా నిద్దరోడుతున్నారు. ఎంచక్కా.. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పోలీసు జీపులోనే హాయిగా కునుకు తీస్తున్నారు. ప్రమాదం జరగముందు అప్రమత్తం చేయాల్సిన పోలీసులు.. జరిగిన తర్వాత వెళ్లి హడావిడి చేస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి లావేరు మండలం అదపాక జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై ఇద్దరు పోలీసులకు హైవే 2 వాహనంపై శనివారం ఉదయం విధుల్లోకి వచ్చారు. వీరు తమ పరిధిలో జాతీయ రహదారుల్లో వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా, ట్రాఫిక్ జాం కాకుండా, ప్రమాదాలు జరిగితే అప్రమత్తం చేయాల్సివుంది. శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఆ ఇద్దరు పోలీసులు ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట వద్ద జాతీయ రహదారి పక్కన చెట్టు కింద హైవే 2 వాహనం పార్కింగ్ చేసి, అందులోనే మంచి నిద్రలోకి జారుకున్నారు. దీన్ని చూసిన కొందరు వాహనచోదకులు వారి ఫొటోలను క్లిక్‌మనిపించి 'జాతీయ వార్త'కు పంపించారు.







## ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని కాజీపేట వద్ద  మునిసిపల్ కమిషనర్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ కార్మికులందరూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు పాల్గొన్నారు.



# గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**-డీఐజీ గోపీనాథ్ జట్టి**

**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తన కార్యాలయం నుండి రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిందితుల అరెస్టు, ఆస్తుల జప్తు, డీ-అడిక్షన్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. గంజాయి అక్రమ రవాణాలో లబ్ధిదారులుగా ఉన్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి త్వరితగతిన జప్తు చేయాలని ఆదేశించారు.ఈ కేసుల్లో ఉన్న నిందితులను తక్షణమే గుర్తించి డిటెయిన్ చేయాలని సూచించారు.గంజాయి వినియోగదారులను గుర్తించి, వారికి కౌన్సెలింగ్ చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాలని తెలిపారు. ఇప్పటి



వరకు 296 మంది బాధితులను డీ-అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఇప్పటికే 24 కొత్త చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, వారిపై ఉన్న ఎన్.బి.డబ్ల్యూలను ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, తక్షణమే చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు.గంజాయి పట్టుకున్న కేసులలో జాతీయ నార్కోటిక్స్ బ్యూరో కు రివార్డు కొరకు అప్లై చేయాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు కలెక్టర్ల ద్వారా పరిహారం త్వరగా అందేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు, చిన్నారులు జరిగే నేరాలకు సంబంధించిన నిందితులపై షీట్ లను తెరవలన్నారు.మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలలో భాగంగా శక్తి యాప్, శక్తి బృందాల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. ఆత్మ రక్షణ శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. సీసీ టీవీలు, డ్రోన్ల ద్వారా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేరాలను త్వరితగతిన ఛేదించలని అధికారులకు సూచించారు. రేంజ్ పరిధిలో  జిల్లాల ఎస్పీలు కెవి మహేశ్వర్ రెడ్డి, తుహిన్ సిన్హా, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మాధవ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వినియోగించాలి

**ఇచ్ఛాపురం, మార్చి 22(వార్త):** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జేసీఐ ఇచ్ఛాపురం సభ్యులు నీటి సంరక్షణ అవసరాన్ని ప్రజలకు తెలియజేసే అవగాహన కార్యక్రమాన్ని జేసీఐ  అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అనే సందేశంతో స్టిక్కర్లు రైల్వే స్టేషన్, పాఠశాలలు, హోటళ్లు, దేవాలయాలు, అన్న క్యాంటీన్ వంటి ప్రాముఖ్యమైన ప్రదేశాల్లో అతికించారు. నీటి వ్యయాన్ని తగ్గించి, ప్రజల్లో నీటి ప్రాముఖ్యతను తెలియజేశారు. నీరు అనేది అమూల్యమైన వనరు, దీని సంరక్షణ భవిష్యత్ తరాల కోసం ఎంతో కీలకం. జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో ఈ స్టిక్కర్లు అతికించడం వల్ల ప్రజల్లో నీటి వినియోగంపై శాశ్వత ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ ఉద్దేశంతో ముందుకు వచ్చిన జేసీఐ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ముఖ్యంగా స్వరూప్, పవన్, దిలేష్, సంతోష్ తదితర సభ్యులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, నీటి




సంరక్షణ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంలో సహాయపడినందుకు అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. సామాజిక బాధ్యతను నెరవేర్చడంలో ముందుండే జేసీఐ ఇచ్ఛాపురం భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, సామాజిక అభివృద్ధికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను చేపట్టడం కొనసాగిస్తుందని తెలియజేసారు. ఇలాంటి కార్యక్రమాల గురించి మరింత సమాచారం లేదా భాగస్వామ్యం కావాలనుకుంటే, జేసీఐని సంప్రదించాలని కోరారు.

# శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** శక్తి యాప్ తో మహిళలు విద్యార్థులు కు రక్షణ భద్రత ఉంటుందని కావున ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ఫోన్లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలని శక్తి బృందాలు మహిళలు విద్యార్థులకు తెలియజేశారు. జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు ఆదేశాల మేరకు శనివారం శక్తి యాప్ ఆవశ్యకత,ప్రాధాన్యత గురించి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాల,కళాశాల విద్యార్థులకు శక్తి బృందాలు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు.శ్రీకాకుళం, టెక్కలి , కాశీబుగ్గ పట్టణ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణ కొరకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి  యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాల లను శక్తి బృందాలు సందర్శించి శక్తి యాప్ యొక్క ఆవశ్యకత ప్రాధాన్యత శక్తి యాప్ ద్వారా అందించే సేవలు ఇతర ఇతర వివరాలు గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీముల యొక్క సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులకు శక్తి యాప్ యొక్క ప్రయోజనాలు సేవలు వివరించి మహిళలు విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి అప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని ,మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక



అయుధంగా పనిచేస్తుంది అన్నారు. కావున ప్రతి ఒక్క మహిళ విద్యార్థులు ఈ యొక్క ఫోన్లో డౌన్లోడ్,రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పలువురు విద్యార్థిని లకు ఆత్మ రక్షణ పై అవగాహన కల్పించి, మార్కెట్ ప్రదేశాలు, బస్ కాంప్లెక్స్ వద్ద మహిళా ప్రయాణికులకు శక్తి యాప్ డౌన్లోడ్ చేసి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు.

# రక్త కొరత లేని జిల్లానే ధ్యేయం




**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని, వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున  రక్త నిల్వల అవసరం ఉందని నెహ్రూ యువజన కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ యు.వెంకట ఉజ్వల్ శనివారం అన్నారు. స్థానిక పెద్దపాడు విశాఖ-ఏ కాలనీ వద్దగల వీల్స్ మార్ట్, పద్మ పూజిత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బండారు ఫణి కుమార్ సహకారంతో ఉద్యోగులందరూ కలసి తలసేమియాతో పాటు, దీర్ఘకాళిగా వ్యాధులతో బాధపడుతున్న పిల్లల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఒక మహోత్తర కార్యక్రమం తలపెట్టారని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు తెలిపారు. ఇందులో భాగముగా మేనేజింగ్ డైరెక్టర్ బండారు ఫణి కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో రక్త కొరత ఎక్కువగా ఉందని, నగరంలో గల రక్త నిల్వల కేంద్రాలలో పూర్తిగా నిండుగా ఉన్నాయని, ఇది వినటానికి కూడా బాధాకరంగా ఉందని ఈ రోజు మా ఉద్యోగులంతా కలసి మంచి నిర్ణయంతో సుమారు 150 యూనిట్ల రక్తాన్ని సేకరించి, పది మంది ప్రాణాలు కాపాడటంలో బాగమయ్యారని, రక్త కొరతలేని జిల్లానే మా ధ్యేయమన్నారు. ఇందుకు సహకరించిన క్లస్టర్ ఇన్చార్జి ఏ.కృష్ణ, ఐతం.వెంకటేష్, జి.ఆనంద్, యు.రవి, పి. భాస్కర్, ఆర్.కృష్ణ లు బృందంగా ఏర్పడి రక్త దానంపై అవగాహన కల్పించి ఈ రక్త దాన శిబిరానికి సహకరించారని, వారి బృందానికి పేరు పేరునా ధన్యవాదాలన్నారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికను అందించి, ప్రశంసా పత్రాలను ఎన్.వై.కె జిల్లా కోఆర్డినేటర్ యు.వెంకట ఉజ్వల్, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు, వీల్స్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ బండారు ఫణికుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో వీల్స్ మార్ట్, పద్మా పూజిత సంస్థల అధికార యంత్రాగం, సిబ్బంది, జాతీయ యువజన అవార్డు గ్రహీత, రెడ్ క్రాస్ పెంకి.చైతన్య కుమార్, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, నంది ఉమా శంకర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆస్తిపన్ను వసూలులో అశ్రద్ధ వహిస్తే చర్యలు

**పలాస, మార్చి 22 (వార్త):** ఆస్తిపన్ను వసూలులో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు  హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను చెల్లింపులో పట్టణ ప్రజలు  సహకరించి పట్టణాభివృద్ధికి సహకరించాలని  కోరారు. మొండి బకాయిదారుల ఇంటి కుళాయి కనెక్షన్స్, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ తీసుకోరని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారం జప్తు చేస్తామని తెలిపారు  తాత్కాలిక ఆక్రమణ పన్నులు, డిస్ప్లే డివైస్ పన్నులు, ఎంటర్టైన్మెంట్ పన్నులు ప్రజలు సకాలంలో చెల్లించాలని  తెలిపారు. సమావేశంలో మునిసిపల్ రెవెన్యూ అధికారి అమర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, కార్యదర్శులు  పాల్గొన్నారు.

## నాటు సారాతో ప్రమాదం




**ఇచ్ఛాపురం, మార్చి 22(వార్త):** నాటు సారా ప్రమాదకరమని ఎక్సైజ్ సిఐ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం ఆయన ఈదుపురంలో నవోదయం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ  నాటు సారాను తాగడంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో  సర్పంచ్ వర ప్రసాద్, హంగిర్ బేహర, పంచాయతీ సెక్రెటరీ ఎస్ కృష్ణ, ఫిషరీస్ అసిస్టెంట్ - అబ్దుల్ ముబీన్, గయ రామచంద్ర బెహర,తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులు కోసమే ఉల్లాస్ పరీక్షలు




**పలాస, మార్చి22(వార్త):** నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్ పరీక్షలని, వీటిని నిరక్షరాస్యులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో ఎన్.వసంతకుమార్ అన్నారు. వెలుగు కార్యాలయంలో ఆదివారం ఉల్లాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మహిళల్లో అక్షరాస్యత శాతం పెరిగి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.  ఈ కార్యక్రమంలో ఏపీఎం జాంబవతి, 105 వెలుగు సిబ్బంది. మహిళలు పాల్గొన్నారు.

## ఎర్త్ అవర్‌పై అవగాహన

**పలాస, మార్చి 22(వార్త):** లైట్లు ఆర్పండి..రేపటి భవిష్యత్తును వెలిగించండిని బ్రాహ్మణ తర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణ అన్నారు. ఎర్త్అవర్  పురస్కరించుకొని శనివారం ఆ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ హరిత దళం క్లబ్ (ఎన్జీసి), జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బల్బ్ ఆకారంలో మానవహారంగా ఏర్పడి ప్రతీ ఒక్కరూ  స్వచ్ఛందంగా రాత్రి 8:30 నుంచి 9:30 వరకూ తమ ఇంట్లో విద్యుత్తు ఉపకరణాలు గంట పాటు ఆపివేసి ఎర్త్ అవర్ పాటించాలని, విద్యుత్తు పొదుపు ద్వారా భూతాపాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్జీసి క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు ఉపాధ్యాయ సిబ్బంది ఈశ్వరరావు, సుధాకుమారి, జనార్దనరావు, పద్మ, శివప్రసాద్, యామిని, కిషోర్, రజనికుమారి, జ్యోతమ్మ,అరుణకుమారి,కృష్ణవేణి, చిన్నారావు,లక్ష్మిభాయి, విష్ణుఆచారి, మధుసూదన్, రవితేజ, కోటేశ్వరరావు, తులసిరాణి పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పిల్లల సంరక్షణ పై దృష్టి సారించాలి

**ఇచ్ఛాపురం, మార్చి 22(వార్త):** పోషణ బి -పడాయి బి శిక్షణలో భాగంగా ఇచ్ఛాపురం ప్రాజెక్ట్ పరిధిలోగల 257 అంగన్వాడి కార్యకర్తలకు ప్రత్యేక అవసరం గల పిల్లలహక్కుల చట్టం, వైకల్యాల సాధారణ రకాలు, గృహ సందర్శనలు ఆవశ్యకత, ముందస్తు సంకేతాలు గుర్తింపు, పిల్లల సంరక్షణపై శనివారం అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ విద్యార్థుల అసెస్ మెంట్ కార్డుల గూర్చి వివరించి, అంగన్వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణలో ప్రాజెక్ట్స్ ఆఫీసర్ నాగరాణి , సూపర్వైజర్స్ బి.సుజాత, నీలవేణి, పల్లవి, పుష్పలత, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.





## క్యాట్ లెవెల్ 2లో అభి సాత్విక ప్రతిభ

**ఆమదాలవలస, మార్చి 22(వార్త):** శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్) లెవెల్ 2 పరీక్షలో ఆమదాలవలస మండలం తోటాడ కొత్త రోడ్డుజంక్షన్‌కు చెందిన దుగ్గివలస అభిసాత్విక సత్తా చాటింది. ఇటీవల నిర్వహించిన లెవల్ 2 పరీక్షలో బంగారు పతకం తో పాటు నగదు పురస్కారం పొందింది. విజయవాడలోనిఐపీఎల్ బ్రాంచ్ లో 8వ తరగతి చదువుతోన్న అభిసాత్విక అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకుగాను బంగారు పతకం, ప్రశంస పత్రంతో పాటు వెయ్యి రూపాయల నగదు పురస్కారానికి ఎంపికైనట్లు తల్లిదండ్రులు దుగ్గివలస రాంప్రసాద్, భవాని తెలిపారు. ఐపీఎల్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు చేతుల మీదుగా చెక్కు ప్రదానం చేసినట్లు తెలిపారు. అకడమిక్ ప్రిన్సిపాల్, ఎక్జిక్యూటివ్ డీన్ నాగభూషణం, ఐపీఎల్ బ్రాంచ్ ఇంఛార్జులు డి.శ్రీనివాసులు, కేటీసీ ప్రసాద్ ఇతర ఉపాధ్యాయులు అభి సాత్వికను అభినందించారు.

## ఫారం పాండ్ల ఏర్పాటు



**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** పల్లె పండుగ లో భాగంగా ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలని అభివృద్ధి చేసుకోవచ్చుని, తద్వారా నీటి ఎద్దడి నివారణకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. గార మండలం అంపోలు పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఈ పథకం ద్వారా 30 వేల పనులు 4300 కోట్లతో జరిగాయని అప్పట్లా కాకుండా నిధులు పక్కదారి పట్టకుండా పక్కాగా పనులు చేయడం జరుగుతుంది నీ తెలిపారు. ప్రతి రైతుకు ఫారం పాండ్ కింద 60 వేల నుంచి పది లక్షల వరకు పనులు చేయవచ్చునని తెలిపారు. సీసీ రోడ్లు, గోశాలలు, చెరువుల అభివృద్ధి పనులు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చునని తద్వారా రైతులకు పంటల కోసం నీటి వినియోగం కూడా చేసుకోవచ్చుని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం సహకారంతో ఉపాధి హామీ పథకం పనులు పూర్తిస్థాయిలో జరిపించడం జరుగుతుందని అందరూ ఈ పనులు ఉపయోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ఉపాది హామీ కూలీలు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సీతారాం

**ఎచ్చెర్ల, మార్చి 22(వార్త):** పదోతరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులకు సమకూర్చిన సదుపాయాలను పరిశీలించేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీ ఎస్సీపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం శనివారం ఎచ్చెర్ల ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించారు. వెలుతురు,ఫ్యాన్లు సరిపడినన్ని ఉన్నవీ, లేనిది, విద్యుత్ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయా, మరుగుదొడ్లు శుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బ ఎదురైతే ఎటువంటి ముందస్తు చికిత్స ప్రక్రియలు చేపడతారో జిల్లా విద్యాశాఖాధికారులు,స్కూల్ యాజమాన్యం నుండి అడిగి తెలుసుకున్నారు,ప్రాథమిక చికిత్సలో ఎటువంటి మందులు వినియోగిస్తున్నారో పారా మెడికల్ సిబ్బంది నుండి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారధ్యంలో పరీక్ష కేంద్రాల్లో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ముందస్తుగానే అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి జాగృత పరిచినట్టు తెలిపారు,బాలల హక్కులకు ఎక్కడ విఘాతం కలిగినా ఉపేక్షించబోమని అన్నారు, ఈ పర్యటనలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి,ఎచ్చెర్ల మండల విద్యాశాఖాధికారులు కె.పున్నయ్య, జి.రాజ్ కిశోర్,సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఏ.సంజీవ రావు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బి. జయదేవి,సిట్టింగ్ స్క్వాడ్ కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం

**-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**కోటబొమ్మాళి, మార్చి 22(వార్త):** నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో శనివారం గ్రామీణ నీట సరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల పరిధిలో 497 గ్రామాలకు కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చామన్నారు. అందులో భాగంగానే రూ. 97 కోట్ల రూపాయల నిధులు లభ్యత ఉన్నందున త్వరిగ గతిన పనులు పూర్త చేయాలని సూచించారు. గ్రామాల్లో అవసరమున్న చోట తాగునీరు బోర్లు వేయాలని సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ, నాలుగు మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను పరిష్కరించాలి

ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. శనివారం కోటబొమ్మాళి మండలంలోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందించాలన్నదే లక్ష్యమని చెప్పారు. భూసమస్యలు పరిష్కరించాలని డమర, నర్సింగపల్లి గ్రామస్థులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా రాధకాంతం మఠం భూములు తమ ఆదీనంలో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ కూడాఅయిందని అయితే వన్‌బీ అడంగల్ రావడం లేదని వివరించారు. తక్షణమే భూ సమస్యలు పరిష్కరించాలి టెక్కలి ఆర్డీవోకు ఫోన్‌లో ఆదేశించారు. కృష్టాపురం గ్రామానికి చెందిన పలువులు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని తాగునీరు అందించాలని వినతపత్రం ఇచ్చారు. బన్నువాడ పంచాయతీకి నూతన సచివాలయం మంజూరు చేయాలని గ్రామానికి చెందిన సనపల మురళీధర్, వట్టికూళ్ల రామకృష్ణ, వట్టికూళ్ల డిల్లీశ్వరరావు, పోలాకి ఆనందరావు, కొండలరావు తదితరులు విన్నవించారు. బన్నువాడలో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రివర్యులు హామీ ఇచ్చారు. నూతన నివాసాలు మంజూరు చేయాలని, నీరు చెట్టు పనులకు సంబంధించి బిల్లు రాలేదని వినతపత్రం అందజేశారు. డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని పలు గ్రామాల ప్రజలు వినత పత్రం అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

# యువత బెట్టింగ్ యాప్స్‌కు బానిసలు కావొద్దు




**పలాస, మార్చి 22(వార్త):** బెట్టింగ్ యాప్స్ యువత ప్రలోభలకు గురు కావద్దని కాశీబుగ్గ డి.ఎస్.పి ఎం వెంకట అప్పారావు అన్నారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి శ్రీనివాస లాడ్జి జంక్షన్ వరకు గ్రీన్ ఆర్మీ మరియు పలాస వాసి పేస్ సంయుక్త నిర్వహించిన అవగాహన ర్యాలీలో వివిధ విద్యార్థి సంఘాలు ,ప్రజా సంఘాలు ప్రజాప్రతినిధులు, వివిధ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిబుగ్గ డిఎస్పి వెంకట అప్పారావు మాట్లాడుతూ యువత బెట్టింగ్ లోన్ యాప్ ఉపయోగించి అప్పులు పాలై,నేరాలు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదవ్యక్తం చేశారు. మీపరిసర ప్రాంతాల్లో ఎవరైనా బెట్టింగ్ నిర్వహించి పాల్గొన్నట్లయితే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ యువత విలువైన సమయాన్ని కోల్పోయి.. బెట్టింగ్స్ వలన.. బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలియజేశారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల .గోపాల్ మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఈజీ మనీ, ఇన్స్టంట్ మనీకి అలవాటు పడిన యువత కష్టపడకుండా ...డబ్బులు సంపాదించడం అనుకొని.. నేరాల బాట.. పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ఫ్లరెన్సెస్ ,సెలబ్రిటీలు , ప్లేయర్స్ సమాజ హితం కోసం ప్రమోట్ చేయాలి కానీ ఇలాంటి చెడు ప్రభావం చూపే వాటికి ప్రచారం చేయకూడదని కోరారు. దీనిపై కఠినమైన చట్టాలు వచ్చి శిక్షలు పడేవిధంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ శ్రీకాంత్ , పలాస వాసి దిలీప్, సిఐటియు గణపతి, సీపీఐ చాపర వేణుగోపాల్, పిడి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినో ద్, ఉత్తరాంధ్ర జీడిపిక్కల ఉద్యమ నాయకుడు తేప్పల అజయ్ కుమార్, పవనపుత్ర సేవాసమితి పల్గుణారావు, తా మాడ దాలమ్మ,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మెట్ట సూర్యనారాయణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ పైలా జవహర్, పలాస యూత్ అసోసియేషన్ నక్క అనిల్ కుమార్, సూర్య తేజ, విద్యా వాహిని, జీకే ప్రసాద్ ,కార్తిక్ శేఖర్, ప్రభుత్వ ఐటిఐ విద్యార్థిని, విద్యార్థులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్షయరహిత సమాజానికి కృషి



**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వి. బాలకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాలను గురించి శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని ఆయన తెలిపారు. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం చూపుతుందని ఆయన వివరించారు. జిల్లాలో గతేడాది 3,854 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 3,428 కేసులు నమోదైనట్లు తెలిపారు.సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందని డాక్టర్ బాలకృష్ణ హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో సంప్రదించాలని ఆయన సూచించారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీనిని పూర్తిగా నివారించవచ్చునని, క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు డి ఎం హెచ్ ఓ కార్యాలయం నుండి 7 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి టి.బి. ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేసి, క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించిన దాతలను సత్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి శ్రీకాంత్, డిఐఓ డాక్టర్ రాందాస్, డిపిఎమ్ఓ వాన సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె సూర్యచంద్ర రావు సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ వాటి ఆవశ్యకతను గుర్తించిన విద్యార్థులు, భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించగలరని పేర్కొన్నారు. వారం రోజులుగా ప్రభుత్వ మహిళా కళాశాల లో సాఫ్ట్ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు.

నాంది ఫౌండేషన్ వారి మహేంద్ర ప్రైడ్ క్లాస్ ప్రోగ్రాం ట్రైనర్ యెస్ అయేషా షేక్. 53 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిం చారు. మొదటి రోజు విద్యార్థులకు బాడి లాంగ్వేజ్ మరియు పర్సనల్ గ్రూమింగ్ పై అవగాహన కల్పిస్తూ అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమం చివరి రోజు లో భాగంగా విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్ ప్రెసెంటేషన్స్ చేశారు. డాక్టర్ యస్ వాణికుమారి మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇంటర్ పర్సనల్ స్కిల్స్ అండ్ కమ్యునికేషన్ స్కిల్స్ అనే క్వాలిటీ ప్రతి ఎంప్లాయర్ తన జాబ్ అభ్యర్థుల్లో ఉండేలా కోరుకుంటున్నారని, అందువల్ల ఈ వారం రోజుల వర్క్ షాప్ విద్యార్థులు సద్వినియోగ పరుచుకొని భవిష్యత్తులో ఉన్నతి సాధించాలని తెలిపారు.

విశిష్ట నైపుణ్యం చూపించిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి శంకరనారాయణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పద్మావతి , అకడమిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ అఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి. జెకెసి కో-ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, వి.శైలజ, పూర్ణిమ, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఎమ్మెల్యే

**పలాస, మార్చి 22(వార్త) :** అసత్య ప్రచారాలు మానుకోవాలని, తప్పుడు రాతలు రాసిన వారిపై కోర్టు మొట్టికాయ పెడుతుందని, తప్పుడు రాతలు రాసి గత ఐదేళ్లలో మానసికంగా ఆవేదనకు గురి చేశారని మీడియా అంటే గౌరవం ఉందా తప్ప చులకన బుద్ధితో వ్యవహరించకూడదని పలాస ఎమ్మెల్యే గౌత శిరీష భావోద్వేగానికి గురయ్యారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి అప్పలరాజు మాటలు విని తప్పుడు రాతలు రాసి తన ఉనికిని చాటుకున్నారని మండిపడ్డారు. తనను ఆదరించిన పలాస నియోజవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# పలాస మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

**పలాస, మార్చి 22(వార్త):** పలాస మున్సిపల్ బడ్జెట్‌ను ప్రారంభ నిల్వతో కలిపి 61 25. 80 లక్షలు గా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. శనివారం పుర పాలక సంఘ భవనంలో సమావేశ మందిరంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షుడు ఆమోదం చేసి, సాధన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్లు పలు అంశాలపై అభ్యంతర వ్యక్తం చేస్తూ ఆమోదించారు. ప్రజా ఆరోగ్యం సంబంధించి బడ్జెట్లో పెద్ద ఎత్తున వ్యయం చూపించినప్పటికీ ఆ నిధులు ఎక్కడికి వెళ్తున్నామని కౌన్సిలర్లు ప్రశ్నించారు. 31 వార్డులో అభివృద్ధి చేయాలని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసినప్పుడే కౌన్సిల్ను గుర్తిస్తారని చెప్పారు. కౌన్సిలర్ దువాడ శ్రీకాంత్ మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ గంట పట్టణాలకు త్రాగునీ సమస్య ఉందని, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్రాగునీరు కోసం ఉద్దానం ప్రాజెక్టు అనుసంధానం చేసేందుకు ప్రయత్నించగా, అందుకు అంగీకారం తెలిపి తాగు నీరు ఇచ్చేందుకు ఉద్దాన ప్రాజెక్టు అంగీకారం తెలిపిందని చెప్పారు.

ఈ సమావేశంలో పలాస మున్సిపల్ కమిషనర్ నడిపిన రామారావు, డి ఈ కనకరాజు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు గూరిటి సూర్యనారాయణ, తంగుడు ఆశలత, గుజ్జు జోగారావు,దుర్గా శంకర్ పండ, పప్పల ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

**మందస, మార్చి 22(వార్త):** రక్తదానంతో మరొకరి ప్రాణదానం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ డీవీజే రమేష్ కుమార్ అన్నారు. మందస, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, ఐదు మండలాలకు సంబంధించి మెరైన్ పోలీస్ స్టేషన్ సేవా కార్యక్రమం లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యంగా ఉద్దానం తీర ప్రాంత మత్స్యకారు గ్రామాలలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో ఉన్నందున వారికి రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదానం చేసి, ప్రాణ దాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ డీవీజే రమేష్ కుమార్ పర్యవేక్షణలో మెరైన్ సిబ్బంది తో కలిపి సుమారు 65 మంది రక్త దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనగా, వారి నుంచి సుమారు 64.5 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బారువా మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస ఐదు మండలాల్లోని యువత తీర ప్రాంత మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా సీహెచ్ గొల్లగండి యువతకు ఇన్స్పిరేషన్ గా ఇద్దరు అన్నదమ్ములు ఎం.సంతోష్ కుమార్, కామేశ్వరరావు రక్తదానము చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. టెక్కలి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సునీత, సిబ్బంది పలాస కాశీబుగ్గ ప్రాణదాత ఫౌండేషన్ సిబ్బంది, అదేవిధంగా హరిపురం సీహెచ్సీ, సోంపేట ఆసుపత్రి సిబ్బంది, స్థానిక సామాజిక పెద్దలు బి.మాధవరావు ఎస్.రాజేష్ ఖన్నా, సార దూర్వాసులు, కొర్ల రవి, ప్రేమ్ కుమార్, పవనపుత్ర సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామానికి చెందిన జన సైనికుడు వికలాంగుడు చీకటి కృష్ణారావు 16వ సారి రక్త దానం చేసి, అందరికీ ఇన్స్పిరేషన్ గా నిలవడంతో ప్రత్యేకంగా మెరైన్ సీఐ అభినందించారు. కార్యక్రమంలో సీఐ డీవీజే రమేష్ కుమార్, ఎస్సైలు శ్రీనివాసరావు, శిరీష, ఏఎస్ఐలు పొట్టి కోదండరావు, జి.మాధవరావు హెచ్సీలు గౌరీశంకర్, విశ్వనాథం, సిబ్బంది, కానిస్టేబుళ్ళు సంగమేశ్వర రావు, సురేష్ కుమార్, కామేశ్వరరావు, శాంతమూర్తి, శేఖర్, సింహాచలం, దాలినాయుడు, రవీంద్ర, మహేష్, హెూంగార్డులు కామేశ్వరరావు, శేషు, వెంకట్, హేమ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మెరైన్ సీఐ గారు హాజరైన యువతకు బాధ్యతగల పౌరులకు రక్తదానం అపోహాలు తొలగించి, అవగాహన కలిగించారు. రక్తదాన కార్యక్రమములో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సీఐ కృతజ్ఞతలు తెలియజేశారు.



# అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకి సహకరించండి

**శ్రీకాకుళం, మార్చి 22(వార్త):** శ్రీకాకుళం నగరం అంబేద్కర్ జంక్షన్ లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహ ఏర్పాటుకి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ను దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీమ, డా. కంఠ వేణు కోరారు. ఈ మేరకు వారు రాష్ట్ర మంత్రిని కోటబొమ్మాలి లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యాలయంలో శనివారం కలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు అక్కడ జంక్షన్ ను అభివృద్ధి చేసేలా చర్యలుచేపట్టాలని వారు వినతిపత్రం అందజేసారు. దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీసు,డా. కంఠ వేణులు వినతిపై తక్షణం స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ తో మాట్లాడుతానని... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దయ వల్ల అంతా ఉన్నత స్థానాలలో ఉన్నామని అటువంటి మహానుభావుని కాంస్య విగ్రహం నగరంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ జంక్షన్ను అభివృద్ధి చేసి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి దాని చుట్టుప్రక్కల అందంగా ఉండేలాగా, ఆ జంక్షన్ లో రోల్ మోడల్ గా ఉండేలా నిర్మాణ పనులను చేపడతానని ఆ బాధ్యత నాదేనని ఆయన అన్నారు . బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న జరుగనున్న దృష్ట్యా ఆ లోపు పనులు పూర్తి చేసేలా కలెక్టర్ తో మాట్లాడి... పనులు చేపడతానని తెలిపారు ... అంబేద్కర్ కాంచ విగ్రహం ఏర్పాటులో మంత్రి అచ్చెన్నాయుడు భాగస్వామ్యమై.. హామీ ఇచ్చినందుకు దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీసు,డా.కంఠ వేణు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.




# ఆర్.ఐ.ఓ.ను సన్మానించిన వృత్తి విద్యా అధ్యాపకులు



**విజయనగరం, మార్చి 22(వార్త):** విజయనగరం జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రారంభించిన వృత్తివిద్యా కోర్సుల స్పాట్ క్యాంపును విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి ఆదినారాయణను అధ్యాపకులు దుశ్శాలువతో సన్మానించారు. ఈ నెల 17 నుంచి మేజర్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభించి నేటితో ముగియనున్న సందర్భంగా క్యాంప్ ప్రొఫెషనల్స్ ఆర్ఐఓ ను సన్మానించారు. ఈ క్యాంపులో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యంజిల్లాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. శనివారం నుంచి ఒకేషనల్ మైనర్ సబ్జెక్టులైన జీ.ఎఫ్.సీ, ఫిషరీస్, ఈఈటీ, ఈటీ, ఎఫ్.జీ.ఎం. టీటీటీ, ఓటీ, పీటీల మూల్యాంకనం ప్రారంభమౌతుందనీ ఆర్.ఐ.ఓ తెలిపారు. బోర్డు ఆర్డర్లు వచ్చిన ఎగ్జామినర్స్, ఇతర ప్రొఫెషనల్స్ అందరూ బొండపల్లిలోని సాయి సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు నిర్దేశించిన మార్గదర్శకాలకు పాటించాలనీ, నిర్దేశించిన సమయంలో మూల్యాంకనం పూర్తి చేయాలని కోరారు. అర్థశాస్త్ర, భౌతికశాస్త్రం జనరల్ సబ్జెక్టుల మూల్యాంకనం కూడా నేటితో ప్రారంభిస్తున్నట్లు సీసీఓ ఎం.వినోద్ బాబు తెలిపారు. ఆంగ్ల భాష ఎగ్జామినర్లు ఎవరైనా ఉంటే అర్జెంటుగా క్యాంపులో రిపోర్టు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వృత్తివిద్య స్పాట్ క్యాంపు కోసం వెన్యూ ఇచ్చిన స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్‌ను అధ్యాపకులు ఎస్వీ సన్యాసిరావు, వెలమల అప్పారావు, వై.శ్రీని వాస్, యు.మురళి, పి.తిరుపతిరావు సన్మానించారు. ఈ సమావేశంలో వి.విజయలక్ష్మి, కాళ్ల గోవిందరావు, రాంప్రసాద్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## పలాసలో గంజాయి పట్టివేత..ఇద్దరి అరెస్టు

**పలాస, మార్చి 22(వార్త):** పలాసలో ఒడిశా కు చెందిన ఇద్దరు గంజాయి ముఠా సభ్యులను కాశీబుగ్గ పోలీసులు శనివారం అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ వెంకట అప్పారావు వెల్లడించారు. శనివారం కాశీబుగ్గ డిఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ వ్యసనాలకు బానిసై ఐపిఎల్ బెట్టింగ్ లకు అలవాటు పడిన జుల్షన్ ఆనంద్, తన స్నేహితుడైన మోజెస్ కుమార్ పానీతో కలిసి ఒడిశా రాష్ట్రం ఉదయ గిరి నుంచి 7.8 కిలోల గంజాయి బ్యాగులను పలాస రైల్వే స్టేషన్ నుంచి చెన్నై వెళ్లేందుకు అక్రమంగా రవాణా చేస్తుండగా రైల్వే స్టేషన్ రోడ్డులో కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారని చెప్పారు.నిందితులపై ఎన్ డి పీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు.నిందితుల నుంచి 7.8 కిలోల గంజాయి సీజ్ చేసి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని డిఎస్పీ వెంకట అప్పారావు వెల్లడించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం



**మందస, మార్చి 22(వార్త):** ప్రజా దర్బార్‌తో సమస్యలు పరిష్కారమవుతాయని పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని బాలిగాం జంక్షన్ లో గల నరేష్ ఫంక్షన్ హాల్ లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీషా మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజా శ్రేయస్సు కొరకే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రజలు నుండి వచ్చిన వినతులు సచివాలయ పరిధిలోనే పరిష్కరమయ్యేలా చూడాలని చెప్పారు. ప్రజల నుండి పలు సమస్యల పై వినతులను స్వీకరించారు. అనంతరం మందస మండలం మకరజోల గ్రామాలలో ఉపాధి హామీ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల అధికారులు, టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వెలుగు సిబ్బందికి లోకోస్ యాప్‌పై శిక్షణ

**మందస, మార్చి 22(వార్త):** గ్రామీణ ప్రాంతంలో ఉన్న స్వయం శక్తి సంఘాలకు జాతీయస్థాయిలో ఉన్న నేషనల్ రూరల్ లైవ్లివుడ్ మిషన్ వారి సౌజన్యంతో సంఘ సభ్యులందరికీ పూర్తి సమాచారాన్ని లోకోస్ యాప్ లో సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఖచ్చితంగా పొందుపరచడానికి అవసరమైన శిక్షణను వెలుగు సిబ్బంది అందరికీ ఇస్తున్నట్లు వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంఘం స్థాపించిన నుండి సభ్యురాల వారి పొదుపులు, సభ్యులు తీసుకొన్న అప్పులు, సంఘానికి వచ్చిన వడ్డీలు, ప్రభుత్వం ఇప్పటి వరకు అందజేసిన రాయితీలు, ఆదాయ వ్యయాలన్నింటినీ ఖచ్చితంగా లెక్కలు వేసి యాప్ లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఐదు లేదా ఆరు సంఘాలకు ఒక కమ్యూనిటీ ఎన్యూమరేటర్ను గుర్తించి వారికి అవసరమైన శిక్షణను ఇచ్చి వారి ఫోనులో ఇస్తున్న యాప్ ద్వారా కూడా యాన్యువల్ ఫైనాన్స్ ఎండ్ లైవ్లీవుడ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయించాలన్నారు. ఈ ప్లాను తయారు చేయడానికి స్థానిక సంఘ సభ్యులను సమావేశపరిచి స్థానిక వి.వో.ఏ.లు మరియు సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్లు అవగాహన కల్పించాలని తెలిపారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి ఈ ప్లాన్ ఆధారంగానే సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను వారి కుటుంబ మాత్రమే ఉపయోగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ వీరంనాయుడు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, అందరు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ.లు, అకౌంటెంట్ కళ్యాణి, ఇతర మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546